క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: కొత్తపాలెం, నరసింహనగర్ శ్రీరామ్‌నగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గోపాలపట్నం బంక్ ప్రాంతం, నరసింహనగర్, వుడా కాలనీ, టైలర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, నాగేంద్ర కాలనీ, సూర్యానగర్, సంతోష్‌నగర్, డీఏఆర్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

భవిత సెంటర్ సందర్శన



భవిత సెంటర్‌లో విద్యార్థుల వివరాలు పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ అప్పలనాయుడు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ–బ్లాక్ పాఠశాలలోని భవితా సెంటర్‌ను గురువారం ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ డి.అప్పలనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత పేర్లు, వారాల పేర్లు ఇంగ్లిష్‌లో రాయించారు. చిన్నారులు అభినయ గేయాలను అభినయిస్తూ ఆలపించారు. వీరి పాటలు చూడముచ్చట గొలిపాయని అప్పలనాయుడు సంతోషం వ్యక్తం చేశారు. భవితా సెంటర్‌లో చదువుకుంటున్న విద్యార్థుల వివరాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌ఈ కో ఆర్డినేటర్లు ధనలక్ష్మి, మాధవిలను ఆయన అభినందించారు. స్కూల్ హెచ్‌ఎం ఎస్.ప్రభాకరరావు, ఉపాధ్యాయుడు ఎం.మోహనరావు పాల్గొన్నారు.

సేవల్లో మేటి శంకర్‌రెడ్డి



దుర్గానగర్ కొండపై శంకర్‌రెడ్డి ఆర్థిక సాయంతో నిర్మిస్తున్న ఆలయం

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌కు చెందిన ఏడూరి శంకర్‌రెడ్డి తన సొంత నిధులతో స్వగ్రామాన్ని అభివృద్ధి చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పేదరికంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుండి అనేక కష్టాలు అనుభవించి, చిన్న వయసులోనే తల్లిని కోల్పోయారు. జీవితంలో పోరాటం చేస్తూ దినపత్రికలు పంచుతూ, టెక్నీషియన్‌గా పని చేస్తూ విద్యాభ్యాసం పూర్తి చేశారు. పట్టుదలతో ముందుకెళ్లిన శంకర్‌రెడ్డి విదేశాల్లో విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి ఎందరికో సాయం అందించారు. ఈ క్రమంలో తన సొంత గ్రామమైన దుర్గానగర్‌కు ఏదైనా చేయాలనే ఆలోచనతో కోటి రూపాయలతో ఆలయాల అభివృద్ధి, తాగునీటి బోర్లు, వాటర్ పైప్‌లైన్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తను పడిన కష్టాలు యువత పడకూడదనే ఆలోచనతో పలువురు యువతకు ఉపాధి ఆధారిత పనులపై అవగాహన కల్పిస్తూ ఉదారత చాటుకుంటున్నారు.

దుర్గంధభరితంగా సర్వీస్ రోడ్డు



మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద సర్వీస్ రోడ్డులో వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి సమీపాన గల సర్వీస్ రోడ్డు దుర్గంధభరితంగా మారింది. ఇక్కడ ఆలయానికి వచ్చిన భక్తులతోపాటు పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మార్గంలోని గెడ్డలో మురుగు తొలగించేటప్పుడు వ్యర్థాలను సర్వీస్ రోడ్డుపై డంప్ చేస్తున్నారు. మళ్లీ తరలించేటప్పుడు ఆ మార్గాన్ని నీటితో పరిశుభ్ర పరచాల్సి ఉంది. ఇక్కడ జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేయకపోవడంతో సర్వీస్ రోడ్డులో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేటు వద్దు.. సర్కారు బడి ముద్దు

- మోహనరావు మాస్టారు విస్తృత ప్రచారం
- పెరుగుతున్న చేరికలు
- స్ఫూర్తిదాయకంగా ఉందంటున్న స్థానికులు



లక్ష్మీనగర్ ఈ-బ్లాక్‌లో ప్రచారం చేస్తున్న మోహనరావు మాస్టారు

గోపాలపట్నం: పాఠశాలకు వస్తున్నామా.. పాఠాలు చెప్పామా.. వెళ్తున్నామా.. జీతం అందుకుంటున్నామా అనేవాళ్లే ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో తాము పని చేస్తున్న పాఠశాలను మరింత మెరుగ్గా మారుద్దామని కష్టపడేవారు చాలా కొద్ది మంది మాత్రమే. ఆ కోవకి చెందిన వారే మోహనరావు మాస్టారు. ఆయన లక్ష్మీనగర్ పాఠశాలకు వచ్చే సమయంలో ఆ పాఠశాల అధ్వాన స్థితిలో ఉండేది. రాత్రి వేళల్లో అక్కడ మద్యం సేవిస్తూ, ఇష్టానుసారం ప్రవర్తిస్తూ పలువురు ఆకతాయిలు పాఠశాలను అశుభ్రంగా మార్చేశారు. అలాంటి స్థితి నుంచి పాఠశాలను మంచి వాతావరణంలోకి మార్చడంలో మాస్టారు సఫలీకృతులయ్యారు. ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేశారు. స్థానికుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలపై మక్కువ కలిగేలా కౌన్సెలింగ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి చెందడంతో దాని రూపురేఖలే మారిపోయాయి. ఆకతాయిలు పాఠశాల వైపు చూసేందుకు కూడా సాహసించడంలేదు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మోహనరావు మాస్టారు చేస్తున్న కృషిని అంతా మెచ్చుకుంటున్నారు. సొంత వాహనంపై తిరుగుతూ మైక్‌లో లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్ పాఠశాలలో విద్య, వసతుల గురించి ఆయన వివరించే విధానం అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో ఇప్పటి వరకు 28 మంది విద్యార్థులు చేరారు. 5వ తరగతిలో 19 మంది, 10వ తరగతి విద్యార్థులు కొందరు బయటికి వెళ్లిపోగా.. ఒకటో తరగతిలో 18 మంది, మిగిలిన తరగతుల్లో 10 మంది చేరారు. వీరిలో ఏడుగురు ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చి చేరిన వారుండడం విశేషం.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మోహనరావు మాస్టారు



పిల్లలకు పాఠాలు బోధిస్తున్న మాస్టారు

నా ప్రయత్నం సత్ఫలితమిచ్చింది..

పాఠశాల సెలవు దినాల్లో విద్యార్థులను పాఠశాలలో చేర్పేందుకు మైక్‌లో ప్రచారం చేస్తుంటాను. ప్రభుత్వ పాఠశాలలపై చాలా మందికి చిన్న చూపు ఉంటుంది. దాన్ని తొలగించేందుకు ఈ విధంగా ప్రచారం చేపట్టాను. ఇది చాలా మందిలో చక్కటి మార్పుకు దోహదపడింది. లక్ష్మీనగర్-ఎఫ్ బ్లాక్‌లో బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాను. బడిలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు తల్లిదండ్రులకు తెలిస్తే బడికి పంపుతారని నా ప్రయత్నం నేను చేస్తున్నాను. ఇందుకు మా పాఠశాల హెచ్‌ఎం ఎస్. ప్రభాకరరావు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు. నాతో పాటు మా పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

– మోహనరావు మాస్టారు, లక్ష్మీనగర్ ఈ-బ్లాక్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు

కనుల పండువగా పెద్దింటమ్మ పండగ



పూజలందుకుంటున్న పెద్దింటమ్మ వారు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలో వేంచేసిన పెద్దింటమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామ కంఠం పెద్దలు ప్రతి ఏటా జూలై మాసంలో పండగు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా గురువారం తెల్లవారి 6 గంటల నుండి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. మందిరంలో కొలువుదీరిన పెద్దింటమ్మ వారికి ఆలయ పూజారి పసుపు, కుంకుమలతో అర్చన చేశారు. వస్త్రాలు, ఆభరణాలు, సుగంధ మాలలను అమ్మవారికి అలంకరించారు. మల్కాపురం నుండే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి పలు రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ పెద్దలు భోగవల్లి నాగభూషణం, సత్యాల మహేష్, ఉరుకూటి బాబూరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి..!

- మార్కెట్‌లో కిలో రూ.120
- రైతుబజార్లలో దొరకని మిరపకాయలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్ శాఖాధికారులు



పచ్చి మిరపకాయలు

విశాఖ విద్య: పచ్చిమిర్చి ఘాటెక్కింది. వ్యాపారుల సిండికేట్‌తో మార్కెట్‌లో మిర్చి దొరకని పరిస్థితులు తలెత్తాయి. మార్కెట్‌లో గురువారం కిలో మిర్చి రూ.120 ధర పలికింది. పచ్చి మిరపకాయల సరఫరా లేదనే సాకుతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధర నిర్ణయించి, అమ్మకాలు సాగించారు. అమ్మో.. ఇంత రేటా? అంటూ వినియోగదారులు నోళ్లు వెళ్లబెట్టినా.. ఇష్టం ఉంటే కొనండి, లేదంటే వెళ్లిపోండి అంటూ దుకాణదారులు తెగేసి చెబుతున్నారు. రోజువారీ కూరల్లోకి పచ్చిమిర్చి తప్పనిసరి కావడంతో చేసేది లేక వినియోగదారులు వాటిని అధిక ధరలను వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఇంతేనా అంటూ వినియోగదారులు పెదవి విరిస్తున్నారు.

రైతుబజార్లలో కానరాని మిర్చి

నగర వాసులకు నిర్ణీత ధరకే రోజువారీ నిత్యావసరాలు, కూరగాయలు అందించేందుకని జిల్లాలో 13 రైతుబజార్లు ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డు కలిగిన సుమారు 2 వేల మంది రైతులు ప్రతి రోజూ తమ ప్రాంతాల నుంచి కూరగాయలు, ఇతర వస్తువులను తీసుకొచ్చి రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రైతుబజార్లపై మార్కెటింగ్ శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వినియోగదారుల నుంచి మంచి డిమాండ్ ఉండే నగరంలోని గోపాలపట్నం, కంచరపాలెం, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ వంటి రైతుబజార్లలో సైతం ప్రస్తుతం పచ్చిమిర్చి దొరకడం లేదు.

అధికారులు ఏం చేస్తున్నారు..?

నిత్యావసర సరకులు, కూరగాయలను నిర్ణీత ధరలకే రైతుబజార్లలో విక్రయించేలా మార్కెటింగ్ శాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కొన్ని రోజులుగా పచ్చిమిర్చి దొరకడం లేదని రైతుబజార్లలోని అధికారులను వినియోగదారులు నిలదీస్తున్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని వినియోగదారులు అంటున్నారు. మార్కెటింగ్ శాఖాధికారులు నిర్ణయించిన ధరకు వ్యాపారులు మిర్చి సరఫరా చేయడం లేదు. సరకు లేదని కృత్రిమ కొరత సృష్టిస్తూ, బయట మార్కెట్‌లోని దుకాణదారులకు సరఫరా చేస్తున్నారు.

ప్రభుత్వానికి పట్టదా..?

నిన్న మొన్నటి వరకు ఉల్లిపాయలు, టమాటో వంటి సరకుల కోసమని వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికీ రైతుబజార్లలో వీటి కోసమని స్టాళ్ల ముందు క్యూ కడుతున్నారు. రైతుబజార్లలోని స్టాళ్లలో కుళ్లిన టమాటోను వినియోగదారులకు అంటగడుతున్నారు. పైనుంచి తమకు ఇలాంటి టమాటోనే సరఫరా అవుతుందని, మేమెందుకు నష్టపోవాలని దుకాణదారులు తెగేసి చెబుతున్నారు. ఇప్పుడు, పచ్చిమిర్చి కొరత నెలకొంది. ప్రజానీకం రోజువారీ నిత్యావసర సరకుల కోసమని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. కూటమి ప్రభుత్వం ఇలాంటి సమస్యలపై దృష్టి పెట్టకపోవడంపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడూ ఇంతే.. మారదు అంతే

- హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్య
- అర కిలోమీటర్ మేర నిలిచిపోతున్న వాహనాలు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, విద్యార్థులు
- ఎన్నాళ్లయినా ఇదే సమస్య అంటూ వాపోతున్న స్థానికులు



లేబర్ గేటు నుంచి యారాడ పార్కు వరకు నిలిచిపోయిన వాహనాలు



లేబర్ గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

మల్కాపురం: ఆ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తుంది. ఒకటి కాదు రెండు కాదు సంవత్సరాల తరబడి ఇక్కడ ఈ సమస్య ఉన్నా అధికారులు మాత్రం శాశ్వత పరిష్కారం చూపటం లేదని వాహన చోదకులు, ఉద్యోగులు, ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ 61వ వార్డు పరిధి ఆర్‌కే పురానికి సమీపాన హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు ఉంది. ఈ గేటు ద్వారా హెచ్‌పీసీఎల్‌లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో పాటు, సొసైటీ కార్మికులు తదితరులు నిత్యం వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజు ఉదయం 8 నుండి 9.30, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ఇక్కడ కార్మికులు రాకపోకలు సాగిస్తారు. వారంతా గుంపుగా గేటులోకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డుపైకి రావటంతో రద్దీ ఏర్పడుతుంటుంది. ఆ సమయంలో అటువైపు వచ్చే వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి నెలకుంటుంది. దీనికి తోడు కార్మికులను తీసుకెళ్లేందుకు పెద్ద సంఖ్యలలో ఆటోలు వస్తాయి. వాటిని డ్రైవర్లు ఇష్టానుసారంగా నిలిపేస్తుంటారు. దీంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. అదే సమయంలో షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, ఎస్‌బీసీ, ఎస్ఆర్, కోరమాండల్ తదితర పరిశ్రమల్లో విధులకు వెళ్లే ఉద్యోగులతో పాటు, వివిధ కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంవత్సరాల తరబడి ఇక్కడ ఈ సమస్య ఉన్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపకపోవటంతో వాహన చోదకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఇటు లేబర్ గేటు నుంచి ఆర్‌కేపురం వరకు నిలిచిపోయిన వాహనాలు

ఏయూతో పరిశోధన భాగస్వామ్యంపై ఎన్‌ఎస్‌టీఎల్ చర్చలు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో పరిశోధన సంబంధంగా కలిసి పనిచేసే దిశగా ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు చర్చించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో ఏయూ అధికారులతో ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు వి.ఎఫ్.సాజి, వి.శ్రీనివాసరావు, టి.వేణుగోపాలరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగంతోపాటు ఇంజినీరింగ్ కళాశాలలోని పలు విభాగాలతో సంయుక్తంగా కలిసి పని చేయడంపై చర్చించారు. త్వరలో ఒక సాంకేతిక సమ్మేళనం(కాంక్లేవ్)నిర్వహించే దిశగా చర్చలు జరిపించారు. భవిష్యత్తులో వివిధ అంశాలతో పరిశోధన సంబంధంగా పనిచేసే దిశగా అవసరమైన అవగాహన ఒప్పందాలు చేసుకోవడంపై ప్రాథమిక చర్చలు జరిపారు. ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్ (ఈవెనింగ్ కోర్సు)లో ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, సిబ్బందిని భాగస్వామ్యం కల్పించే దిశగా చర్చించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, డీన్ ఔట్ రీచ్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలతో ఏయూ వీసీ రాజశేఖర్, ఆచార్యులు

8వ వేతన సంఘం కమిటీ ఏర్పాటు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

డాబాగార్డెన్స్: ఎనిమిదవ వేతన సంఘం కమిటీని తక్షణమే నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం నేవల్ డాక్‌యార్డ్ ఎంవోపీ గేట్ల వద్ద ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ నేతృత్వంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. రక్షణ రంగ సంస్థల ప్రధాన ద్వారాల వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు, బీపీఎంఎస్ ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టా విద్యాసాగర్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు మాట్లాడారు. అనంతరం సమాన స్థాయిలో ఉన్న నాన్ పిటిషనర్ ఉద్యోగులకు కోర్టు తీర్పుల ద్వారా న్యాయ రక్షణ అంశాల్ని విస్తరింపజేయాలని, హెచ్‌ఆర్‌ఏపై ఓవర్ టైం అలవెన్స్ లెక్కించాలనే అంశాలతో కూడిన వినతిపత్రాన్ని తూర్పు నావికాదళం సీసీపీవోకు అందజేశారు. తమ వినతిని ప్రధాని మోదీకి పంపాలని కోరారు. నిరసనలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు బి.శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కోరుబిల్లి వెంకటనాయుడు, పి.సురేష్, అల్లిపిల్లి నరసింహరాజు, ఆడారి రమేష్, రవికుమార్, పి.రాజు, కె.వెంకటేశ్వరరావు, గోపీనాథరెడ్డి, గొన్న మహేష్, నొడగల శ్రీనివాసరావు, మోహనరావు, సాహూ, భాను, హరీష్‌బాబు, లోవరాజు, శేషు, రామకృష్ణ, బండారు శివ, కాసుబాబు, జగదీష్, చింతాడ రమణ, శ్రీనుబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఆర్చ్, ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభం



కేజీహెచ్‌లో ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా కేజీహెచ్‌లో రూ.45 లక్షలతో నిర్మించిన ప్రధాన ద్వారాన్ని ప్రారంభించామన్నారు. అనంతరం దివీస్ ల్యాబ్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ. కోటి 28 లక్షలతో సమకూర్చిన 12 యూనిట్లతో కూడిన 8 సురక్షిత తాగునీటి ఆర్‌వో ప్లాంట్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత, టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త సీతంరాజు సుధాకర్, స్థానిక కార్పొరేటర్ కె. అప్పలరత్నం, మాజీ కార్పొరేటర్ జ్యోతి, జనసేన పార్టీ వార్డు అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, టీడీపీ వార్డు అధ్యక్షుడు సీఎం రమణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవాలి



దళితరత్న మాటూరి చిన్నారావును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింథియా: నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు అండగా ఉండాలని పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ, దళితరత్న మాటూరి చిన్నారావు సూచించారు. ఈ మేరకు గురువారం నూతనంగా నియమితులైన 62వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, 63వ వార్డు అధ్యక్షుడు ఎలగాడ రాజులను పలువురు కార్యకర్తలు, నాయకులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ వారికి ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయలు అందేలా కృషి చేయాలని, అప్పుడే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. అనంతరం స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డితో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వార్డు కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్: లారీని నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమాన విధిస్తూ నగరంలోని జ్యుడీషియల్ ప్రధాన మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాగర్‌నగర్‌కు చెందిన పల్లా అప్పలరాజు (40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జార్ఖండ్‌కు చెందిన జనార్దన్ ఝా 2022 డిసెంబర్ 21న విశాఖ ఓడరేవు ప్రాంతంలోని లక్ష్మీ కాటా దగ్గరకు వచ్చి తన లారీలోని సరుకును తూస్తున్నాడు. అప్పలరాజు మరో టిప్పర్‌లో వెనుక నుంచి వచ్చి బలంగా లారీని ఢీకొన్నాడు. పక్కనే ఉన్న డ్రైవర్ జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. హార్బర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.సత్యనారాయణ శ్రీనివాస్ కేసు విచారణ జరిపి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై పైవిధంగా తీర్పునిచ్చారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌లోని భీమేశ్వర ఆటో యూనియన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్ణపాటి జోసెఫ్ అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎంతో ఆరోగ్యంగా ఉండే జోసెఫ్ మరణవార్త కలవరపరిచిందన్నారు. జోసెఫ్ పార్టీకి ఎంతో సేవలందించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి రూ.10 వేల నగదు అందించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వేళంగిణిరావు, కిషోర్, ఈశ్వరి, సంపంగి రత్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.